

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

8 పేజీలు | మంగళవారం | నవంబర్ 28, 2023 | www.navatelangana.com



అకాల వర్షం..తడిసిన ధాన్యం

- కొనుగోలు కేంద్రాల్లో తడిసి ముద్దయిన ధాన్యం
- దిలావర్‌పూర్, ముధోల్ మండలాల్లో లబోదిబోమంటున్న రైతులు

3లో...



హస్తం..దరిద్రానికి నేస్తం..

- తీర్పు వచ్చాక సంగతి చెప్పడే..
- చెన్నూర్ అభ్యర్థి బాల్క సుమన్‌ను గెలిపించాలని మంత్రి కేటీఆర్ రోడ్ షో

7లో...

ప్రలోభాలు షురూ..!

- గ్రామాల్లో మద్యం..డబ్బుల పంపిణీకి శ్రీకారం
- ఓటర్లను ఆకర్షించేందుకు విందులు ఏర్పాటు
- కుల, యువజన సంఘాలతో పార్టీల బేరసారాలు
- ప్రజలను తమ వైపు తిప్పుకునేందుకు పడరాని పాట్లు
- ఎన్నికల్లో గట్టెక్కేందుకు రాజకీయ పార్టీల ఎత్తుగడలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సమయం దగ్గరపడటంతో ప్రలోభాల పర్వం ప్రారంభమైంది. గ్రామాలు, పట్టణాల్లో డబ్బుల పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. మరో రెండు రోజుల్లోనే పోలింగ్ జరగడంతో అంతకుముందే ఈ తతంతం పూర్తిచేసేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రణాళికలు వేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొన్ని గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో మద్యం, డబ్బుల పంపిణీ మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. ప్రలోభాలపై ఎన్నికల సంఘం నిఘా పెట్టి పెద్ద ఎత్తున పట్టుకుంటున్నా ఆగడం లేదని తెలుస్తోంది. ఇప్పటికే ఇతర ప్రాంతాల నుంచి మద్యం బాటిళ్లు ఇక్కడకు డంప్ అయినట్లు తెలుస్తోంది. వీటిని రహస్య ప్రాంతాల్లో నిల్వ ఉంచి అక్కడ్నుంచి గ్రామాలకు సరఫరా చేసి పార్టీ కార్యకర్తల ద్వారా జనానికి పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. పోలింగ్‌కు మరో రెండు రోజులు సమయం మాత్రమే ఉండటంతో ఈ ప్రలోభాలు మరింత అధికమయ్యే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సమయం దగ్గర పడుతోంది. ఇప్పటికే ఆయా రాజకీయ పార్టీలు నువ్వా-నేనా అనే రీతిలో ప్రచారం ముమ్మరం చేశాయి. భారీ జన సమీకరణ చేపట్టి..అగ్రనేతలను రప్పించి హడలెత్తించాయి. ఒకరికి మించి మరొకరు ప్రచార పర్వాన్ని వేడెక్కించారు. బరిలో ఉన్న అభ్యర్థులు ఒకరినొకరు మాటల తూటాలు పేల్చుకున్నారు. విమర్శలు, ప్రతివిమర్శలతో రాజకీయ పర్వాన్ని పదునెక్కించారు. ప్రధాన పార్టీలైన అధికార బీఆర్‌ఎస్‌తో పాటు ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలు విజయం కోసం అహర్నిషలు శ్రమిస్తున్నాయి. మరోసారి అధికారంలోకి రావాలని బీఆర్‌ఎస్.. ఈ సారి అధికార పగ్గాలను చేపట్టాలని కాంగ్రెస్,బీజేపీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ఇందులో ఎవరు గెలుపెవరిదీ..అధికారం ఎవరికి దక్కుతుందోనని ఇప్పటికే జనాల్లో చర్చలు ప్రారంభమయ్యాయి. మరోపక్క ఆయా రాజకీయ పార్టీలు ప్రలోభాల పర్వానికి తెరలేపాయి. ఇప్పటికే మిగతా..2లో...



తెలంగాణలోనూ కర్ణాటక తరహా ఫలితాలే

- కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై ప్రజలకు విశ్వాసం
- పచ్చి అబద్ధాలతో రెండుసార్లు కేసీఆర్ అధికారంలోకి
- 24 గంటలు ఉచిత కరెంట్ డొల్ల
- చత్తీస్‌ఘడ్ సీఎం భూపేష్ బఘెల్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

కర్నాటక తరహా ఫలితాలే తెలంగాణలోనూ పునరావృతమవుతాయని, ఆరు గ్యారంటీలపై ప్రజలకు విశ్వాసం ఉందని చత్తీస్‌ఘడ్ ముఖ్యమంత్రి భూపేష్ బఘెల్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆదిలాబాద్‌లో పర్యటించారు. పట్టణంలోని ప్రజాసేవా భవన్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి, కర్నాటక ఎమ్మెల్సీ, ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రకాష్ రాథోడ్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో పర్యటిస్తున్న క్రమంలో ఇక్కడ కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణం కనిపిస్తోందన్నారు. తెలంగాణ ప్రజానీకానికి మిగతా..2లో...

చెన్నూర్‌లో నువ్వా..! నేనా..!!

- బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య తీవ్ర పోటీ
- మరో విజయం కోసం బీఆర్ఎస్ తాపత్రయం
- పాగా వేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నం
- నియోజకవర్గంలో హోరాహోరీ పోరు



మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గంలో రసవత్తర పోరు జరుగుతోంది. రెండు ప్రధాన పార్టీల మధ్య నువ్వా-నేనా అనే రీతిలో పోరు సాగుతోంది. పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో రాజకీయాలు మరింత రసకందాయంగా మారాయి. ఇక్కడ విజయం సాధించేందుకు ఎవరికి వారు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే రెండు సార్లు గెలిచిన బీఆర్ఎస్ మరోసారి విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టాలని చూడగా.. అధికార పార్టీని మట్టికరిపించి విజయం సాధించాలని కాంగ్రెస్ భావిస్తోంది. వీరితో పాటు బీజేపీ సైతం కొంత మేర ఓట్లు సాధించే అవకాశం కనిపిస్తోంది. పలువురు స్వతంత్రులు సైతం గణనీయమైన ఓట్లు సాధించి సత్తా చాటాలని చూస్తున్నారు. 14మంది బరిలో నిలిచిన ఈ నియోజకవర్గంలో ఎవరు నెగ్గుతారోననే తీవ్ర ఉత్కంఠకు దారితీస్తోంది.





నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

వివరాలు.. 2లో...

(మొదటి పేజీ తరువాయి)

ప్రలోభాలు షురూ..!

ఆయా కుల, యువజన సంఘాలను మచ్చిక చేసుకున్న పార్టీలు వారికి వివిధ రకాల తాయిళాలు ప్రకటించినట్లు ప్రచారం జరుగుతోంది. మరోపక్క భవిష్యత్తులో కొందరికి పదవులు, బ్యాంకు రుణాలతో పాటు వివిధ రకాల సంక్షేమ కార్యక్రమాలు అందేలా చూస్తామని భరోసా ఇచ్చి వారి పార్టీవైపు వచ్చేలా చేసినట్లు తెలుస్తోంది.ఇప్పటికే మెజార్టీ జనాలు సైతం ఆయా పార్టీల వారీగా విడిపోయినట్లు ప్రచారం జరుగుతోంది.

ప్రలోభాల పర్వం షురూ..?

ఇన్నాండ్లు వివిధ రకాల ప్రలోభాల ద్వారా వివిధ వర్గాలను మచ్చిక చేసుకున్న పార్టీలు తాజాగా స్వీయ ప్రయోజనాలు కల్పించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పల్లెలు, పట్టణాల్లో మద్యం పంపిణీకి సమాయత్తమవుతున్నట్లు తెలుస్తోంది. మరో రెండు రోజుల పాటు ఇంటికో సీసా ఇచ్చేందుకు ప్రణాళికలు వేసుకున్నట్లు సమాచారం. ఆయా గ్రామాలకు ఇప్పటికే మద్యం చేరిపోయినట్లు తెలిసింది. వీటితో పాటు ఇంటింటికి తిరుగుతూ డబ్బులు పంపిణీ చేయడం ద్వారా ఓట్లను రాబట్టవచ్చనే ఉద్దేశంతో ఈ రకమైన ఆలోచన కూడా చేస్తున్నట్లు తెలుస్తోంది. వీటితో పాటు కొందరు యువతకు దావత్‌లు ఇవ్వడం ద్వారా వారి ఓట్లను గంపగుత్తగా పొందవచ్చనే భావిస్తున్నట్లు సమాచారం. పోలింగ్‌కు మరో రెండు రోజులు సమయం మాత్రమే మిగిలిన ఉన్న దృష్ట్యా ఈ లోపు ప్రలోభాల పర్వాన్ని పూర్తిచేసేందుకు సిద్ధమవుతున్నాయి. మరోపక్క ఎన్నికల సంఘం సైతం వీటిపై పూర్తిగా నిఘా పెట్టాయి. ఇప్పటికే చాలా చోట్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుంటూ ప్రలోభాలకు అడ్డుకట్ట వేసే దిశగా ప్రయత్నాలు చేస్తున్నాయి. వీటితో పాటు అనుమతి లేకుండా తరలిస్తున్న డబ్బులను పట్టుకున్నారు. పల్లెలు, పట్టణాల్లో డబ్బు పంపిణీపై అడ్డుకోవడంపై దృష్టిసారిస్తున్నట్లు తెలుస్తోంది.

తెలంగాణలోనూ కర్ణాటక తరహా ఫలితాలే

సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. మోసపూరిత మాటలతో ప్రజలను మభ్యపెడుతూ రాజ్యాధికారం చేపడుతున్నారని విమర్శించారు. 10 ఏళ్ల తెలంగాణాలో కేవలం కేసీఆర్ కుటుంబమే బాగుపడిందన్నారు. భూమి, నీరు, మద్యం, ఖనిజ వనరులన్నీ కేసీఆర్ కుటుంబ దోపిడీకి గురయ్యాయన్నారు. ఈ రాష్ట్ర ప్రజలు చైతన్యవంతులని, వారు ఈ మారు మోసపోవడానికి ఏమాత్రమూ సిద్ధంగా లేరన్నారు. కాంగ్రెస్ హామీలను ఎల్లప్పుడు నిలబెట్టుకుందన్నారు. ఛత్తీస్‌ఘడ్‌లో కోటి ఎకరాల భూమిని ఆదివాసులకు పంపిణీ చేశామన్నారు. 9.5వేల కోట్ల నిధులను ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి ఖర్చు చేశామన్నారు. కేంద్రం నుండి ఆశించిన సహకారం లేదన్నారు. కాంగ్రెస్ పాలిత ప్రాంతాలపై కేంద్రం నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. స్థానిక వనరులను అభివృద్ధికి వినియోగించుకోవాలన్నది కాంగ్రెస్ విధానమని స్పష్టం చేశారు. మోడీ, కేసీఆర్ ఇద్దరిదీ ఒకే విధానమని, వారిద్దరూ అంతర్గత మిత్రులని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం ధరల పెంపుతో సామాన్య ప్రజల నడ్డి విరుస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం దళితులకు ఇస్తానన్న 3ఎకరాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, దళితబంధు, విద్య వైద్యం తదితర హామీలు అటకెక్కాయని విమర్శించారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితి తమ ఆరు గ్యారంటీలపై ప్రభావం చూపబోదన్నారు. రైతులకు, మహిళలకు వెచ్చించే నిధులు తిరిగి సమాజంలోనే వినియోగం అవుతాయని తెలిపారు. సాధారణ ప్రజలకు ఇచ్చే సంక్షేమ పథకాలతో ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. కాంగ్రెస్‌తో కేసీఆర్‌కు భయం పట్టుకుందన్నారు. అటు సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత విషయంలో ఈడీ కేవలం నోటీసులతో సరిపెట్టడం బీజేపీ, బీఆర్ఎస్ మధ్య బంధానికి నిదర్శనమన్నారు. తెలంగాణలో 24 గంటలు కరెంటిస్తున్నామంటున్నారని, ఆ కరెంటు తామే సప్లై చేస్తున్నామని అన్నారు. దానికి సంబంధించిన డబ్బులు ఇంకా కేసీఆర్ సర్కార్ బకాయిపడి ఉందని గుర్తు చేశారు. మీడియా సమావేశంలో మహారాష్ట్ర మాజీ మంత్రి అనీస్ అహ్మద్, ఏఐసీసీ సభ్యులు అబ్బాస్, టీపీసీసీ కార్యదర్శి వెంకటేశం పాల్గొన్నారు.

చెన్నూర్‌లో నువ్వా..! నేనా..!!

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో చెన్నూర్ నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. గతంలో కాంగ్రెస్, టీడీపీ పార్టీలు ప్రాతినిధ్యం వహించగా.. ఉద్యమ కాలం నుంచి బీఆర్ఎస్ ఈ స్థానాన్ని ఆక్రమించింది. 2009 నుంచి 2018 వరకు ఇక్కడ బీఆర్ఎస్ నుంచి నల్లాల ఓదేలు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించగా.. 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ అధిష్టానం ఓదేలుకు కాకుండా ఎంపీగా ఉన్న బాల్క సుమన్‌కు అసెంబ్లీ టికెట్ కేటాయించడంతో ఆయన సిట్టింగ్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి బరిలో నిలిచారు. ఇక బీజేపీ నుంచి దుర్గం అశోక్ పోటీ చేస్తుండగా మిగితా 11మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ కలిగిన పార్టీలతో పాటు స్వతంత్రులు పోటీలో ఉన్నారు. ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో 1,88,417మంది ఓటర్లు ఉండగా పురుషులు 94,206మంది, మహిళలు 94,203మంది, ఇతరులు 8మంది ఉన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ఇక్కడ 30మంది నామినేషన్లు వేయగా ఆరుగురివి తిరస్కరణకు గురయ్యాయి. మరో 10మంది అభ్యర్థులు ఉపసంహరించుకున్నారు. తాజాగా 14మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

ఉత్కంఠ పోరులో గెలుపెవరిదీ..?

చెన్నూర్‌లో ప్రస్తుతం బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఈ ఉత్కంఠ పోరులో ఎవరు గెలుస్తారా అనేది నియోకవర్గంలో ఆసక్తికరంగా మారుతోంది. ఇక్కడ బీఆర్ఎస్ నుంచి రెండోసారి బరిలోకి దిగిన బాల్క సుమన్ మరోసారి విజయం సాధించాలని భావిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు చేపట్టిన అభివృద్ధి పనులు, సింగరేణి కార్మికులకు ఇండ్ల పట్టాల పంపిణీతో పాటు సీఎం కేసీఆర్‌కు సన్నిహితుడని పేరు ఉండటం గెలుపునకు సానుకూలంగా మారగా.. స్థానికంగా ఉండకపోవడం, నాయకులు, కార్యకర్తలను అంతగా పట్టించుకోరనే ప్రచారం జరుగుతుండటం ప్రతికూలంగా మారే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక గతంలో ఎంపీగా పనిచేసిన డా.వివేక్ వెంకటస్వామి తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి అసెంబ్లీ బరిలోకి దిగారు. సౌమ్యుడిగా పేరు ఉండటం, గతంలో చేసిన అభివృద్ధి, నియోజకవర్గంలో పరిచయాలతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ గాలివీయడం వంటి అంశాలు విజయానికి సానుకూలంగా మారగా.. స్థానికంగా ఉండకపోవడం, వివిధ ప్రాంతాల్లో పరిశ్రమలు ఉన్నా స్థానికంగా నెలకొల్పకపోవడం వంటి అంశాలు ప్రతికూలంగా మారే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బీజేపీ నుంచి బరిలోకి దిగిన దుర్గం అశోక్ విజయం కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఆయన చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలు, స్థానికుడనే ముద్రతో పాటు ఆయన సామాజికవర్గం ఓట్లపై భారీ నమ్మకం పెట్టుకున్నట్లు తెలుస్తోంది. వీరితో పాటు పలువురు స్వతంత్రులు, రిజిస్ట్రేషన్ కలిగిన పార్టీల తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులు సైతం విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ ఓట్లను సాధించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ హోరాహోరీ పోరులో విజేతలెవరో..పరాజితులెవరో డిసెంబర్ 3న తేలిపోనుంది.

కారును గ్యారేజ్‌కి పంపే సమయం వచ్చింది

- కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయి
- మంచిర్యాల రోడ్ షోలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా

నవతెలంగాణ - హాజీపూర్



కేసీఅర్ సర్కార్‌ను మార్చి కారును గ్యారేజ్‌కు పంపే సమయం వచ్చిందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. సోమవారం మంచిర్యాల నియోజకవర్గ బిజెపి అభ్యర్థి ఎర్రబెల్లి రఘునాథ్‌ను గెలిపించాలని అభ్యర్థిస్తూ అమిత్‌షా రోడ్ షోలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014, 2018లో కాంగ్రెస్ తరపున గెలిచిన ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి కేసీఅర్ సీఎం అయ్యాడని, కాంగ్రెస్, బీఅర్ఎస్ మధ్య ఒప్పందం ఉందని తెలిపారు. కాంగ్రెస్ పేరుతో గెలిచిన ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి వెళ్తారని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కేసీఆర్‌ను సీఎం చేస్తారని, ఢిల్లీలో రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేస్తారని పేర్కొన్నారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో కేసీఆర్ సీఎం, రాహుల్ ప్రధాన మంత్రి అయ్యే అవకాశాలు లేవన్నారు. మళ్లీ మోడీనే ప్రధాన మంత్రి అవుతారని తెలిపారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా జరుపుకుందామని, ఓవైసీకి భయపడి బీఆర్ఎస్, కాంగ్రెస్ సెప్టెంబర్ 17ను విమోచన దినోత్సవంగా జరపడం లేదన్నారు. బీజేపి అధికారంలోకి వస్తే అధికారికంగా జరుపుతామని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం ముస్లిములకు 4శాతం రిజర్వేషన్ ఇచ్చిందని, బీజేపి అధికారంలోకి వస్తే బీసీలకు 4శాతం రిజర్వేషన్ ఇస్తామని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రి చేసి తీరుతామన్నారు. సింగరేణి కార్మికులకు ఇన్‌కమ్ టాక్స్ రద్దు చేస్తామన్నారు. మంచిర్యాల బరిలో ఉన్న బిజెపి అభ్యర్థి ఎర్రబెల్లి రఘునాథ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించి బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలను కోరారు. మంచిర్యాల పట్టణంలోని శ్రీనివాస్ టాకీస్ నుండి ప్రారంభమైన అమిత్ షా రోడ్ షో అర్చన టెక్స్ చౌరస్తా వరకు కొనసాగింది.

జన ప్రభంజనం మధ్య పీఎస్ఆర్ రోడ్డు షో

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మీ ప్రేమ, అభిమానమే తనను గెలిపిస్తుందని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని కరీంనగర్ చౌరస్తా నుండి ఉత్కూరు చౌరస్తా వరకు భారీ రోడ్డు షో నిర్వహించారు. అడుగడుగునా ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ మీ ప్రేమ, అభిమానం ఉన్నంత కాలం తన విజయాన్ని ఎవరూ ఆపలేరని తెలిపారు. ఇరు పార్టీల నాయకుల మోసపూరిత మాటలు నమ్మకుండా కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకుల ప్రలోభాలకు లొగ్గకుండా నాలుగు రోజులు ప్రతి కార్యకర్త గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. 30న ఉదయం నుండి సాయంత్రం వరకూ అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని, చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. తన కోసం కష్టపడే ప్రతి కార్యకర్త, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. మంచిర్యాల నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి కోసం అహర్నిశలు



కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మండల అధ్యక్షుడు పింగిళి రమేష్, పట్టణ అధ్యక్షుడు ఎండి.ఆరిఫ్, కౌన్సిలర్ రాందేని చిన్న వెంకటేష్, వెంకటేష్, పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నిర్మల్
మంగళవారం నవంబర్ 28, 2023

బీఆర్ఎస్ నాయకుల విస్తృత ప్రచారం

నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంలోని కిర్గుల్(బి) గ్రామంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ముధోల్ బీఆర్ఎస్ అభ్యర్థి విఠల్‌రెడ్డి తరపున కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. ఎలక్ట్రానిక్ నమూనా బ్యాలెట్ ప్రదర్శించి ప్రచారం చేశారు. బంగారు తెలంగాణ సాధన కావాలంటే మూడోసారి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రతాప్‌రావు, సదానంద, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

హామీల అమలుకు బాండ్ పేపర్ రాసిచ్చిన ఎమ్మెల్యే అభ్యర్థి



నవతెలంగాణ-బాసర

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల హామీల అమలుకు ముధోల్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి బోస్లే నారాయణరావు పటేల్ బాండ్ పేపర్ రాసిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు హామీలను తప్పకుండా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ముధోల్ కాంగ్రెస్ అభ్యర్థి నారాయణరావు పటేల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుకు తను కట్టుబడి ఉన్నానని ప్రజలకు ఆరు హామీలు అందే వరకు తనదే బాధ్యత అంటూ వంద రూపాయల బాండ్ పేపర్‌పైన రాసి సంతకం చేశారు. అనంతరం బాండ్ పేపర్‌ను ప్రజలకు పంచిపెట్టారు. బీఆర్ఎస్ బీజేపీ రెండు ఒకటే తోక పార్టీలని 10 సంవత్సరాల కాలంలో తెలంగాణలో అభివృద్ధి జరగలేదని, బంగారు తెలంగాణ అంటూ సీఎం కేసీఆర్ కుటుంబమే లాభపడిందని విమర్శించారు. ప్రాజెక్టుల పేరుతో ప్రభుత్వ ధనాన్ని లూటీ చేశారని అన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ప్రకటించలేదని, మూడు ఎకరాల వ్యవసాయ భూమి పంపిణీ అటకెక్కిందని అన్నారు. పరీక్షల నిర్వహణలోనూ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాజేశ్వర్ దేశ్‌ముఖ్, మాజీ సర్పంచ్ రమేష్, జంగం రాజేందర్, మైనార్టీ సెల్ నాయకుడు జలీల్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతకే ఫ్లాగ్ మార్చ్

● భైంసా రూరల్ సీఐ నైలు

నవతెలంగాణ-కుభీర్

ప్రజల భద్రతకే ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామని భైంసా రూరల్ సీఐ నైలు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీఎస్ఎఫ్ జవాన్లు, పోలీసు సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో ఉన్న ప్రజలు ఎలాంటి భయాందోళనలు చెందకుండా ఉండాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఓటరులు ఈనెల 30న నిర్వహించే ఎన్నికలో ఎలాంటి భయాందోళనలు చెందకుండా ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని అన్నారు. అదే విధంగా పోలింగ్ బూత్ వద్ద అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా కృషి చేస్తామని అన్నారు. ఆయన వెంట కుభీర్ ఎస్సై షరీఫ్, భైంసా రూరల్ ఎస్సై శ్రీకాంత్, మరో ఇద్దరు ఎస్సైలు, సీఐ పోలీస్ బలగాలు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థికి ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుల మద్దతు

నవతెలంగాణ-నిర్మల్



బీఆర్ఎస్ నిర్మల్ ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి సోమవారం ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ మేరకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని ఆప్ పార్టీ నాయకుడు సయ్యద్ హైదర్ కలిశారు. ఆప్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన హైదర్ తర్వాత తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. నిర్మల్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని అన్నారు. ఇంద్రకరణ్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా తమంతా కృషి చేస్తామని ప్రకటించారు. మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని కలిసిన వారిలో జిల్లా నాయకులు సూర్యనారాయణ, కార్యకర్తలు ఉన్నారు.

తాయిలాల పంపిణీకి రంగం సిద్ధం


● పక్కాగా ఓటరుకు చేరేలా ప్రణాళికలు ● వ్యూహ ప్రతివ్యూహాల్లో నాయకులు



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఎన్నికలకు రెండు రోజుల సమయం మాత్రమే ఉండటంతో ప్రధాన పార్టీలు తాయిలాల పంపిణీకి రంగం సిద్ధం చేశాయి. ఎన్నికలకు చివరి రెండు రోజులు కీలకం కాగా, పార్టీల నాయకులు పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించారు. తాయిలాలు పక్కాగా ఓటర్లకు చేరేలా ఆయా పార్టీల నాయకులు బూత్‌ల వారిగా కార్యకర్తలను విభజించారు. గ్రామాల్లో ఈపాటికే తాయిలాల పంపిణీ ప్రక్రియ మొదలైనట్లు సమాచారం. ఓ ప్రధాన పార్టీ బూతుల వారిగా ఓటరు లిస్టును సేకరించి వంద మంది ఓటర్ల బాధ్యతను ఒక కార్యకర్తకు అప్పజెప్పినట్లు సమాచారం. సదరు కార్యకర్త తన పరిధిలోని వందమంది ఓటర్ల ఫోన్ నెంబర్లు సేకరించి అప్పజెప్పిన బాధ్యతను పూర్తిచేస్తున్నట్టు తెలుస్తోంది. నగదు రూపంలో, వస్తు రూపంలో గాని ఓటర్లను ప్రలోభపెట్టేందుకు పక్కాగా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఈసారి జరుగుతున్న ఎన్నికల్లో మాత్రం ఓటర్లు ప్రలోభాలకు ఆకర్షితులయ్యే పరిస్థితులు కనిపించడంలేదు. పార్టీలు ఇచ్చే తాయిలాలు మెజార్టీ ఓటర్లను ప్రభావితం చేయడం సాధ్యం కాదని పరిశీలకులు పేర్కొంటున్నారు.


ఈసారి తాయిలాల ప్రభావం పనిచేయదు



ఈసారి ఎన్నికల్లో ఓటర్లకు తాయిలాల ప్రభావం పని చేయదు. ఓటర్లలో చైతన్యవంతం పెంపొందింది. ఎవరు మభ్యపెట్టిన యువత లొంగదు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉంది.

కే.రవికుమార్, శ్రీరాంనగర్

నచ్చిన వ్యక్తికి ఓటేస్తా ..



పోటీలో ఉన్న వారు ఏవరైనా ప్రలోబాలకు గురి చేస్తే వాటికి లోంగకుండా నాకు నచ్చిన వ్యక్తికి ఓటు వేస్తా.. యువత కూడ ఏలాంటి ప్రలోబాలకు గురికావద్దు. సేచ్ఛయుత వాతావరణంలో ఓటు వేయాలి.

గైని నర్సయ్య, శాంతినగర్

అకాల వర్షం...తడిసిన ధాన్యం

నవతెలంగాణ-దిలావర్‌పూర్, ముధోల్

ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యం సోమవారం ఉదయం కురిసిన ఆకాల వర్షానికి తడిసి ముద్దయింది. పీఏసీఎస్‌లో ఎండబెట్టిన ధాన్యం ఈదురు గాలులతో కూడిన వర్షం రావడంతో ఉన్న టార్పలిన్‌లు గాలులకు లేచి పోవడంతో ధాన్యం తడిపోయింది. అదేవిధంగా నీరు ధాన్యం కుప్పలోకి చేరి పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. తడిసిన ధాన్యాన్ని రైతులు ఎండబెట్టేందుకు మళ్లీ అష్టకష్టాలు పడ్డారు. తాము పడ్డ శ్రమ రెండితలయ్యిందని రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు.



అకాల వర్షంతో తడిసిన వరిధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

ధాన్యం చాలా తడిసిపోయింది



ధాన్యం చాలా మట్టుకు తడిసిపోయింది. తడిసిన ధాన్యాన్ని మళ్లీ ఆరబెడుతున్నాం. సెంటర్‌లో టార్పలిన్ ఇవ్వలేదు. మా వద్ద ఉన్న టార్పాలిన్ సరిపోకపోవడంతో ధాన్యం తడిసిపోయింది.

రాంపూరం మహిపాల్ (రైతు)

ముధోల్‌లో...

మండలంలోని చించాల, ఎడ్‌బిడ్, బోరిగాం, అష్ట, తరోడా, రాంటెక్ తదితర గ్రామాల్లో సోమవారం ఉదయం అకాల వర్షం కురిసింది. సుమారు గంట పాటు కురిసిన ఈవర్షానికి కల్లాల్లో ఆరబెట్టిన వరి ధాన్యం తడిసిపోయింది. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కష్టపడి పండించిన దిగుబడులు కండ్లేదుటే తడిసి పోవడంతో నష్టం వాటిల్లిందని వాపోతున్నారు. అలాగే మరి కొంతమంది రైతుల వరి పొలాలు కోత కోయాల్సి ఉండగా ఈ వర్షానికి పంట దెబ్బతింటుందని పేర్కొంటున్నారు. రైతులు ఈ ఆకాల వర్షం పట్ల తీవ్రంగా నష్టపోయామన్నారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

నవతెలంగాణ-కడెం

బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్ నాయక్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని వైస్ ఎంపీపీ కట్ట శ్యాంసుందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ప్రతి ఇంటింటికి వెళ్లి ఈవీఎంల పని తీరుపై అవగాహన కల్పించారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. మూడోసారి కారుగుర్తుకు ఓటు వేసి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్‌ను గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కడెం సర్పంచ్ కొండాపురం అనూష-లక్ష్మణ్, కడెం ఉపసర్పంచ్ ఎండీ ఆజం, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ఎండీ హసీబ్, మండల కోఆప్షన్ సభ్యులు ఎస్‌కే హైమద్, ఖానాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయిని మంగ, బీఆర్ఎస్ మండల ప్రచార కార్యదర్శి ముబారక్‌బిన్ మొహమ్మద్, కడెం మాజీ ఉపసర్పంచ్ గంగన్న, నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పిప్పల్‌ధరి మహిళ సంఘం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన పిప్పల్‌ధరి మహిళ సంఘం కార్యవర్గం

నవతెలంగాణ- ఆదిలాబాద్ రూరల్

మండలంలోని పిప్పల్‌ధరి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో అనుబంధ సంఘాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగానే సోమవారం మహిళలు సమావేశం ఏర్పాటు చేసుకొని నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా నగ్రాడే నిర్మల, ఉపాధ్యక్షురాలిగా ఎన్ సుమలత, ప్రధాన కార్యదర్శిగా టంకె సాగరిక, సహాయ కార్యదర్శిగా సేండే రమ, కోశాధికారిగా ఛాయా, కార్యవర్గ సభ్యులుగా రేణుక, లక్ష్మీ, గంగుబాయి, దేవ్ భాయి, రమాబాయిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ మారుమూల గ్రామమైన పిప్పల్‌ధరిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మండలం ఏర్పాటు చేసేంత వరకు సాధన కమిటీ సూచనల మేరకు పోరాటంలో తమ వంతు పాత్రపోశిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సాధన కమిటీ అధ్యక్షులు తెలంగ్ బాపురావు, సహాయ కార్యదర్శి నాగోరావ్, నానేశ్వర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను చూసి పార్టీలో చేరికలు

- ఎమ్మెల్యే జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఇతర పార్టీల నుంచి చేరుతున్నారని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం పట్టణంతో పాటు గ్రామీణ మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ ముఖ్య నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కొడప సోనేరావు సొంత గూటికి చేరగా, రామాయి, హత్తిగుట్టకు చెందిన నాయకులతో పాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు షేక్ కలీం, పలువురు చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగురామన్న మాట్లాడుతూ దేశానికే దిక్సూచిగా నిలిచేలా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సీఎం కేసీఆర్ వంటి సమర్థవంతమైన నాయకుడి నేతృత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడుస్తోందని పేర్కొన్నారు. మాయమాటలు చెప్పకుండా సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరిన వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, కేతపల్లి సంతోష్, యూనిస్ అక్బాని, గెడం రాము, ఆశ్రఫ్, సోనేరావు పాల్గొన్నారు.



గులాబీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

నేడు మహాత్మ జ్యోతిభాపూలే వర్ధంతి



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

సామాజిక ఉద్యమ పితామహుడు మహాత్మ జ్యోతిభాపూలే 133వ వర్ధంతిని మంగళవారం పార్టీలకతీతంగా రాజకీయ పార్టీల నాయకులు, బహుజన వాదులు, మాలికులస్తులు జరుపుకోవాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కూలే కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జ్యోతిభాపూలే ఎనలేని సేవ చేశారని తెలిపారు. ఆయన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం జ్యోతిభాపూలే దంపతులకు భారతరత్న ప్రకటించి గౌరవించాలని కోరారు. చదువుల తల్లి సావిత్రిబాయి పూలే పేరుని కస్తూర్బ గాంధీ పాఠశాలలకు నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామ, మండల, జిల్లా కేంద్రాల్లో ఉన్న పూలే దంపతుల విగ్రహాల వద్ద మాలీ కులస్తులు నివాళులర్పించి ఐక్యతను చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో మాలీ మహా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న శిండే, ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ అంబేకర్, అనిల్ కోట్రంగే, ఆదిలాబాద్ పట్టణ కార్యదర్శి సుభాష్ శిండే పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



నార్నూర్‌లో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కార్తీక పౌర్ణమి వేడుకలు జిల్లాలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రసిద్ధ ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. పట్టణంలోని పురాతన శ్రీ రామచంద్ర గోపాల కృష్ణ మఠంలో కార్తిక పౌర్ణమి శోభ కనిపించింది. వందలాది సంఖ్యలో మహిళలు, యువతులు కాగడ హారతులు వెలిగించి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో దీపాలను అందంగా అలంకరించడం విశేషంగా ఆకట్టుకుంది. మఠం ప్రాంగణంలో చేపట్టిన దీపారాధన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెల్లవారుజామున ఆలయానికి వచ్చిన భక్తులు ప్రత్యేక దీపాలంకరణలో పాల్గొన్నారు. మహిళలు, యువతులు దీపాలను వెలిగించి ఆలయ ప్రాంగణంలో వాటిని అందంగా అలంకరించారు. మఠాధిపతి శ్రీ యోగానంద సరస్వతి నేతృత్వంలో ఆలయంలో కాగడ హారతులు అందించి భక్తి గీతాలను ఆలపించారు. వేకువ జాము నుండే భారీ వర్షం కురిసినా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి ప్రత్యేక హారతుల్లో పాల్గొన్నారు. ఇదిలా ఉంటె కార్తిక పౌర్ణమి పర్వదినాన తులసి వివాహాలను అత్యంత భక్తి ప్రపత్తుల నడుమ జరిపారు. పూజలకు అవసరమయ్యే పూజా సామగ్రిని ఖరీదు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో పూజా సామగ్రి, పువ్వులను కొనుగోలు చేశారు. దీంతో వినాయక్ చౌక్, గాంధీ చౌక్ తదితర కూడళ్లలో జనాల రద్దీ కనిపించింది.

నార్నూర్ : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం కార్తీకమాస గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గిరిజన గ్రామాల్లో మహిళలు, యువతులు వారం పదిరోజుల నుంచి ఉదయానే స్నానాలు ఆచరించి దీపాలు వెలిగించి భక్తి భావంతో ఆలయంలో కాకడ హారతి, ఇంట్లో తులసి పూజలు నిర్వహించారు. అనంతరం చివరి రోజు తులసిమాతకు పూలతో అలంకరించి నైవేద్యాలు అర్పించి వివాహం జరిపారు. గ్రామాల్లోని ఆలయాలల్లో అన్నదానం ఏర్పాటు చేశారు.

సేవలందించే అవకాశం ఎన్‌సీసీతోనే సాధ్యం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్‌సీసీ ద్వారా మంచి పౌరుడి లక్షణాలు, క్రమశిక్షణ, ఐక్యత నాయకత్వ లక్షణాలు, మంచి విలువలతో జీవించే జీవన విధానం, దేశానికి జాతికి సేవ చేసే అవకాశం సాధ్యమవుతుందని ఎన్‌సీసీ అధికారి పుట్ట లక్ష్మణ్ అన్నారు. సోమవారం తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ అవతరణ దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. దేశ సేవకు అంకితం కావాలని, ఎన్‌సీసీ ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీని ద్వారా



ఉపాధి అదేవిధంగా ఉన్నంత చదువులకు ఆకాశం ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపక బృందం, పీఏ స్టాఫ్, కెడెట్లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికే ప్రథమ ప్రాధాన్యత

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ప్రజా సంక్షేమానికే బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ పునరుద్ఘాటించారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని ఫిల్టర్ బెడ్ కాలనీలో విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూ మానిఫెస్టోలో పొందుపరిచిన హామీలను తెలియజేస్తూ కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో లేని అభివృద్ధి చేసి చూపించామని తమను ఆదరించాలని కోరారు. మానిఫెస్టోలో సైతం ప్రజా హితమే లక్ష్యంగా హమీలను పొందుపరిచిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఆవుల వెంకన్న, నాయకులు మెట్టు ప్రహ్లాద్, బుట్టి శివకుమార్, జంగిలి ప్రశాంత్, కొమ్ము కృష్ణ పాల్గొన్నారు.

- ఎన్నికల ప్రచారంలో మున్సిపల్ చైర్మెన్ ప్రేమేందర్



ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్

దుర్గం ట్రస్టు ఆధ్వర్యంలో...

అన్ని వర్గాల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని, కారు గుర్తుకు



ప్రచారం నిర్వహిస్తున్న దుర్గం శేఖర్

ఓటు వేసి అభివృద్ధి పట్టం కట్టాలని దుర్గం ట్రస్ట్ చైర్మెన్ దుర్గం శేఖర్ అన్నారు. సోమవారం పట్టణంలోని పలు వార్డుల్లో దుర్గం ట్రస్ట్ సభ్యులతో పాటు దళిత సంఘాల నాయకులు బీఆర్ఎస్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. భుక్తాపూర్, గాంధీ నగర్ కాలనీలలో ప్రచారం చేపట్టి ఎమ్మెల్యే జోగురామన్నను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా దుర్గం శేఖర్ మాట్లాడుతూ ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే జోగురామన్న ఎంతో కృషి చేస్తున్నారన్నారు. భవిష్యత్తులోనూ అభివృద్ధే లక్ష్యంగా జోగు రామన్న సమర్థవంతమైన పాలన అందించనున్నారని వివరించారు. కారు గుర్తు పార్టీకి మరోసారి పట్టం కట్టి భారీ మెజారిటీతో ఎమ్మెల్యే జోగురామన్నను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దయానంద్ కాంబ్లె, జబడే సహెల్ రావు, భీమ్‌రావు వాగ్మారె, జాడి రాజారెడ్డి పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్: మండలంలోని తంతోలి గ్రామంలో సోమవారం బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరిస్తు కారు గుర్తుకు ఓటేయ్యాలని అభ్యర్థించారు. ఈకార్యక్రమంలో నాయకులు సేవ్వ జగదీష్ యాదవ్, మల్లేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అకాల వర్షానికి పత్తి పంట నష్టపోయిన రైతులు



నవతెలంగాణ-తలమడుగు

మండలంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి పత్తి పంటకు నష్టం కలిగింది. వర్షంతో చేనులో పత్తి కొమ్మలు విరిగి నేల కొరిగాయి. వందల ఎకరాల్లో పత్తి పంట నష్టపోయి ఆందోళనకు గురయ్యారు. ఆరుగాలం పండించిన పంట చేతికి వచ్చే దశలోనే ప్రకృతి కారణంగా నష్టపోయామని వాపోతున్నారు. పత్తితో పాటు కంది పంటకు నష్టం వాటిల్లింది. పంటలు చేతికి సమయంలో ఇలా జరగడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు అంటున్నారు. ఇప్పటికే మార్కెట్‌లో ధరలు లేక అవస్థలు పడుతున్నామని, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాలన్నారు. జిల్లా కలెక్టర్ వాటి ఆధారంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ద్వారా పరిహారం వచ్చేల చూడాలని, గతంలో కూడా ప్రకృతి ద్వారా రైతులు తమ పంటలను నష్టపోయారని, రైతుల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఆదుకోవాలన్నారు.

డీఎస్పీ ఇంటింటికీ ప్రచారం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలింపించాలని డీఎస్పీ నాయకులు అన్నారు. సోమవారం పట్టణంలోని నాలుగో వార్డు అనుకుంటలో ఇంటింటికి ప్రచారాన్ని నిర్వహించారు. ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థి అగ్గిమల్ల గణేష్ టార్చ్‌లైట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మంజూష, లక్ష్మి, సుష్మ, శ్యామల, శ్రీవాణి, సంతోష్, సర్వేష్, చందర్, ప్రశాంత్, లక్ష్మణ్, అనుకుంట కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇరుక్కుపోయిన 108 అంబులెన్స్



నవతెలంగాణ-జైనథ్

మండలంలోని తరోడ వంతెన చెడిపోవడంతో వాహనాలు తాత్కాలిక వంతెనపై నుంచి నడుస్తున్నాయి. ఆ వంతెన కూడ చెడిపోవడంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. సోమవారం ఆ వంతెనపై రోగిని రిమ్స్‌కు తీసుకువెళుతున్న 108 వాహనం వంతెన వద్ద ఇరుక్కుపోయింది. దీంతో ఇరువైపుల వాహనాలు నిలిచిపోయాయి. 108 అంబులెన్స్ వాహనం కొద్దిసేపు ట్రాఫిక్‌లో ఇరుక్కు పోయింది. ఇకనైనా కొత్త వంతెన నిర్మించాలని అటుగా వెళ్లె ప్రయాణికులు కోరారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-బేల

మండలంలోని బాధి గ్రామానికి చెందిన పలువురు యువకులు సోమవారం బీఆర్ఎస్ ఉపసర్పంచ్ దంతెల వినోద్ ఆధ్వర్యంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రావుత్ మనోహర్ గులాభి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలకు, జోగు రామన్న నాయకత్వంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధికి యువత ఆకర్షితులై పార్టీలో చేరారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శబరిమలైకి అద్దె ప్రాతిపాదికన ఆర్టీసీ బస్సులు



నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ ఆర్టీసీ డిపో పరిదిలోని నిర్మల్ మండలం కొండాపూర్ గ్రామంలో సోమవారం అయ్యప్ప మాల వేసుకున్న స్వాములను విలేజ్‌బస్ ఆఫీసర్ కుంట మహేందర్ రెడ్డి కలిశారు. శబరిమలై అయ్యప్పస్వామి మండల్‌కు, మకరజ్యోతి దర్శనానికి బస్సులు అద్దె ప్రాతి పదికన ఆర్టీసీ బస్సులు ఇస్తున్నామని తెలిపారు. ఇందులో 5 గురికి ఉచిత ప్రయాణం ఉంటుందని వెల్లడించారు. ఒక గురుస్వామి, ఇద్దరు మణికంఠ స్వాములకు, ఒక వంట మనిషికి, ఒక సహాయకుడికి ఉచిత ప్రయాణం ఉంటుందని తెలిపారు. ఒక బస్సు కంటే ఎక్కువ బస్సులు బుక్ చేస్తే గురు స్వామికి కమీషన్ ఇవ్వబడునని తెలిపారు. అయ్యప్ప స్వాములు బస్సులు బుక్ చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే నాన్ స్వాములు ఎవరయినా 35 మంది ఉంటే వారికి సైతం శబరిమలైకి బస్సు ఇవ్వబడునని తెలిపారు. ఈ అవకాశాన్ని అయ్యప్ప భక్తులు సద్వినియోగ పరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు శివ, ప్రకాష్, తులసి, రాజు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

ఆదరించండి.. అభివృద్ధి చేస్తా..

● బీఆర్ఎస్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్‌రెడ్డి



విఠల్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు

నవతెలంగాణ-కుభీర్

బీఆర్ఎస్ ముధోల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ఆదరించాలని, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు పార్డి(బి) గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా శ్రీ రాజరాజేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నాబావుసాటే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా బీఆర్ఎస్ కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియోజక వర్గంలో ఉన్న ప్రతి పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు సేవ చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. అదే విధంగా రైతులకు ఏడాదికి రూ.15 రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, వంటి తదితర పథకాలను ప్రజలకు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం అక్కడి నుంచి కుభీర్ మండల కేంద్రానికి చేరుకొని, విఠలేశ్వర్ ఆలయంలో పూజలు చేసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శంకర్ చవాన్, బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, మండల అధ్యక్షుడు అనిల్, వైస్ ఎంపీపీ మోహియోద్దీన్, వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ గంగా చరణ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సంతోష్, స్థానిక సర్పంచులు తూము పుష్పలత రాజేశ్వర్, మీరా విజయ్ కుమార్, సర్పంచులు దత్తుగౌడ్, దత్తురాం పటేల్, కార్యకర్తలు, మహిళలు ఉన్నారు.

అంబేద్కర్‌కు విగ్రహానికి పూలమాలలు వేయకుండా అడ్డుకున్న దళితులు...

మండలంలోని పార్డి(బి) గ్రామానికి ఎన్నికల ప్రచారానికి వచ్చిన బీఆర్ ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్‌రెడ్డిని దళితులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేయనియకుండా అడ్డుకొని ఎమ్మెల్యేను కొందరు దళితులు అపి పది సంవత్సరాల్లో గ్రామానికి ఎలాంటి అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. కేవలం దళితులకు ఇప్పటి వరకు ఏఒక్కరికి కూడా దళితబంధు ఇవ్వలేదని అన్నారు. అదే విధంగా డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వలేదని ఎమ్మెల్యేని నిలదీశారు.



బీఆర్ఎస్ అభ్యర్థి విఠల్‌రెడ్డిని అడ్డుకున్న దళితులు

బహుజనుల హక్కుల కోసం బీఎస్పీ

● బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్దార్ వినోద్ కుమార్

నవతెలంగాణ-ముధోల్

బహుజన హక్కుల కోసం బీఎస్పీ పని చేస్తుందని ముధోల్ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్దార్ వినోద్ కుమార్ అన్నారు. సోమవారం ముధోల్‌లోని నాయాబాది చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఇంటింటికి తిరుగుతూ ఈనెల 30న ప్రతి ఒక్కరూ ఏనుగు గుర్తుకు ఓటు వేసి తనను అధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం గడిచిన 9 ఏండ్లలో నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందన్నారు. నియోజకవర్గానికి ఇప్పటి వరకు మార్కెట్ యార్డ్, ఫైర్ స్టేషన్, మెడికల్ కాలేజ్, ఆస్పత్రి తదితర సౌకర్యాలు అందుబాటులో లేవన్నారు. బీఆర్ఎస్, బీజేపీలకు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. బీఎస్పీతోనే బహుజన వర్గాల అభివృద్ధి సాధ్యమని, స్వరాష్ట్రంలో బహుజనులు అభివృద్ధికి దూరమయ్యారని అన్నారు. రాజ్యాధికారంతోనే బహుజనులు అభివృద్ధి పథంలో ముందుకెళ్తారని తెలిపారు. ఒకసారి అవకాశం ఇస్తే నియోజకవర్గం అభివృద్ధి పథంలో తీసుకెళ్తానన్నారు.



మేనిఫెస్టోను వివరిస్తున్న బీఎస్పీ నాయకులు

ప్రతి ఒక్కరూ ఏనుగు గుర్తుకు ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు నల్ల రవికుమార్, ఉపాధ్యక్షులు మధుకర్, ముధోల్, లోకేశ్వరం, కుభీర్, తానుర్ మండలాల అధ్యక్షుడు సునిల్, రాజు, పవన్, లక్ష్మణ్, నాయకులు విశ్వనాథ్, తులసిరామ్, విలాస్, సతీష్, మీనాజ్, ముకుంద్, రాహుల్, సతీష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్మల్‌ను మరింత అభివృద్ధి చేస్తా..



తాత గెలుపు కోసం ప్రచారం చేస్తున్న ఐకేరెడ్డి మనుమడు, మనుమరాలు

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రవినగర్, శాస్త్రి నగర్, ఆస్రా కాలనీ, న్యూఆస్రా కాలనీల్లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ మూడోసారి తనను గెలిపించాలని ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. కారుగుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిర్మల్‌ను రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసుకుందామని అన్నారు. ఈ ప్రచారంలో మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, మాజీ మున్సిపల్ చైర్మెన్ అప్పాల గణేష్ చక్రవర్తి, స్థానిక కౌన్సిలర్ అన్వర్ పాషా, రామగోని తులసి నర్సాగౌడ్, బీఆర్ఎస్ శ్రేణులు, మహిళలు పాల్గొన్నారు.

తాత గెలుపుకు మేము సైతం..

నిర్మల్ బీఆర్ఎస్ అభ్యర్థి ఇంద్రకరణ్‌రెడ్డి గెలుపు కోసం అయన మానుమడు, మనుమరాలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తాతతో కలిసి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేసి తమ తాతను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

నేడు సాయంత్రానికి స్థానికేతరులు వెళ్లాలి

ఆసిఫాబాద్ : వివిధ పార్టీల తరుపున ప్రచారానికి వచ్చిన వారు మంగళవారం సాయంత్రానికి స్థానికేతరులు వెళ్లిపోవాలని జిల్లా ఎస్పీ కే సురేష్ కుమార్ తెలిపారు. తన కార్యాలయం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ అసెంబ్లీ పోలింగ్ 30న సాయంత్రం 4 గంటలకు ముగుస్తుందని, పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల ముందు జిల్లాలోని నియోజకవర్గ వాసులు కానివారు ఎవరు కూడా ఈ నియోజకవర్గాల్లో ఉండరాదని తెలిపారు. కమ్యూనిటీ హాళ్లు, కల్యాణ మండపాలు, లాడ్జీలు, ఫంక్షన్ హాల్స్, ప్రైవేట్ గెస్ట్ హౌస్‌లు అన్నీ నిశితంగా తనిఖీ చేస్తామని తెలిపారు. 28న సాయంత్రం 4 గంటల తర్వాత ఎలాంటి రాజకీయ ప్రచారాలు, కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించకూడదన్నారు. దీనిని అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోగులకు పండ్లు పంపిణీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీఆర్ఎస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు, ఎంఎం హెల్ప్ లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎండీ మహమూద్ 3వ వర్ధంతి సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు, బీఆర్ఎస్ మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా మదర్స అరేబియా మదిన తుల్ ఉలుమ్‌లో పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహముద్ సేవలు చిరస్మరనియమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ ఎండీ అహ్మద్, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ అన్సర్, సాజిద్, నిసార్, షబ్బీర్, రామ్ చందర్, అలీ, జవిద్, సులేమాన్, అబ్బు, జమిల్, ఇస్మాయిల్, ఫిర్దోస్ పాల్గొన్నారు.



వారసంతలో ప్రచారంలో జోరు పెంచిన బీఆర్ఎస్

నవతెలంగాణ-కౌటాల

మండలకేంద్రంలోని వారసంతలో సోమవారం బీఆర్ఎస్ ప్రచారం జోరుగా నిర్వహించారు. మండలకేంద్రంలోని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఇంటి వద్ద నుంచి బస్టాండు వరకు వేలాదిగా మంది పాల్గొని బీఆర్ఎస్ కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీతో మండలకేంద్రం మొత్తం గులాబిమయంగా మారింది. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తరపున ఆయన కుమారుడు కోనేరు వంశీకృష్ణ ప్రచారం నిర్వహించారు. దానికి ముందు ఎమ్మెల్యే కోనప్ప కోడలు కోనేరు మధులిక మండలంలోని గుండాయిపేట్, వీర్దండి, మొగడ్‌దగడ్, తలోడి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పలు గ్రామాల్లో భారీ ర్యాలీ తీశారు. ఈ ర్యాలీలతో మండలం మొత్తం గులాబి జెండాలతో నిండిపోయింది. ర్యాలీ అనంతరం ఎమ్మెల్యే నివాసం వద్ద ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. మరింత అభివృద్ధి చెందాలంటే కారుకు ఓటు వేసి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసుకోవాలన్నారు. ఎన్నికలప్పుడు ఎంతోమంది నాయకులు వస్తూ పోతుంటారని, వారి మాయమాటలు నమ్మవద్దన్నారు. మంగళవారం రైతుబంధు నిధులను విడుదల చేస్తానంటే బీజేపీ, కాంగ్రెస్ అడ్డుకొని రాకుండా చేశాయని, ఇవి ప్రజలంతా గమనించి నన్ను ఆశీర్వదించాలని ఆయన కోరారు. నేటి కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించే ర్యాలీకి భారీ సంఖ్యలో తరలిరావాలని, ఈ ర్యాలీ ఈజ్‌గాం మల్లన్న గుడి నుండి కాగజ్‌నగర్ పట్టణం వరకు నిర్వహించడం జరుగుతుందని కోరారు. ప్రచారంలో ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌గౌడ్, గంగారాం, కోఆప్షన్ సభ్యుడు అజ్మత్ అలీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వసంత్‌రావు, యూత్ మండల అధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్, మహిళా మండల అధ్యక్షుడు బండి శైలజ, మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



బీఎస్పీ గెలిస్తేనే సిర్పూర్‌కు విముక్తి

● **డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**

నవతెలంగాణ-కౌటాల

సిర్పూర్ గడ్డపై నీలి జెండా ఎగరవేసి బీఎస్పీని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తేనే ప్రజలకు విముక్తి లభిస్తుందని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం కౌటాలలో నిర్వహించిన భారీ ఎన్నికల ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇస్తే సిర్పూర్ రూపురేఖలు మారుస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఓట్ల కోసం నకిలీ బంగారు నెక్లెస్‌లను పంచే అవకాశం ఉందని వాటిని నమ్మి మోసపోవద్దని అన్నారు. ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు రీడిజైన్ పేరుతో మేడిగడ్డకు తరలి వెళ్లడానికి ఎమ్మెల్యే కోనప్ప కారణమని ఆరోపించారు. గోదావరి, ప్రాణహిత జీవనదులున్న ఉమ్మడి ఆదిలాబాద్ సాగునీరు లేక ఎడారిగా మారిందన్నారు. రైతాంగానికి సాగునీరు అందించే జగన్నాథ్ పూర్, పీపీరావు ప్రాజెక్టులు, తుమ్మిడిహట్టి, సాండ్‌గాం, రణవిల్లి, కోర్సిని, గూడెం, హుడికిలి, లోనవెల్లి, సూర్జాపూర్, జంబుగ ఎత్తిపోతల ప్రాజెక్టులను పూర్తి చేయడంలో బీఅర్ఎస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. పోడు భూములు సాగుచేసుకుంటున్న గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆరె కులాన్ని కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేగా పోటీ చేసేది అక్రమంగా ఆస్తులు సంపాదించుకోవడం కాదన్న ఆయన పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఐపీఎస్ ఉద్యోగాన్ని త్యాగం చేశానని తెలిపారు. మూడు సార్లు ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యే కోనప్ప ఎలాంటి అభివృద్ధి చేయలేదని, ప్రజలను మళ్లీ ఓట్ల కోసం ఎలా అడుగుతారని ప్రశ్నించారు. కోనప్ప అరాచకాలు, అక్రమాలు పోవాలంటే వచ్చే ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. అనంతరం రవీంద్రనగర్‌లో జరిగిన బహుజన ఆశీర్వాద సభలో పాల్గొన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, జిల్లా అధ్యక్షులు లెండుగురే శ్యామ్ రావు పాల్గొన్నారు.



చింతలమానేపల్లి : గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు, ఆ పార్టీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని డబ్బా బాబాసాగర్, రుద్రపూర్, మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఆశీర్వాద సభలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, జిల్లా అధ్యక్షులు లెండుగురే శ్యామ్ రావు, ఉత్తర తెలంగాణ చేరికల కమిటీ కార్యదర్శి హర్షద్ హుస్సేన్, సిర్పూర్ నియోజకవర్గం తాలూకా అధ్యక్షుడు డోకే రాజన్న, మండల ఇన్‌చార్జి రామగోరి నీల గౌడ్, జాడి తిరుపతి, జి సాగర్ పాల్గొన్నారు.

సమస్యాత్మక కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అసెంబ్లీ నియోజకవర్గ సాధారణ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకమైనదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. సోమవారం ఎన్నికల సాధారణ పరిశీలకులు రాహుల్ మహివాల్, పోలీస్ పరిశీలకులు డీకే చౌదరితో కలిసి జిల్లాలోని 2 నియోజకవర్గాలలో ఉన్న 92 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో నిర్వహించవలసిన విధులు, పనులపై సూక్ష్మ పరిశీలకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 001-సిర్పూర్, 005-ఆసిఫాబాద్ నియోజకవర్గాలలో 92 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరిగిందని, ఈ నెల 30వ తేదీన జరగనున్న పోలింగ్‌కు పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. 001-సిర్పూర్ నియోజకవర్గంలో 294 పోలింగ్ కేంద్రాలు, 005-ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 305 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసి పూర్తి సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
మంగళవారం నవంబర్ 28, 2023

ఆలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు

కౌటాల : ఆలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు సోమవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని శివాలయాల్లో భక్తుల సందడి నెలకొంది. సదాశివ్‌పేట్ శివాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకల్లో సిర్పూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప కోడలు మధులిక పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. వేకువజాము నుండే భారీ సంఖ్యలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి భక్తిశ్రద్ధలతో ఆలయాల వద్దకు చేరుకొని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి కార్తీక దీపోత్సవాలను వెలిగించుకున్నారు. శివనామ స్మరణతో ఆలయాలు మారుమ్రోగాయి. మండలకేంద్రంలోని సదాశివ్‌పేట శివాలయంలో ఆలయ అర్చకులు అంబేద శంకరయ్య, తలోడి హనుమాన్ ఆలయంలో ఆలయ పూజారి మల్లొజ్జుల చంద్రశేఖర్ శర్మ, తాటిపెల్లి, మొగడ్‌దగడ్, గుండాయిపేట్, ముత్తంపేట్ హనుమాన్ ఆలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కాంగ్రెస్ హయాంలోనే పేద ప్రజలకు న్యాయం

- అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు



నవతెలంగాణ-దండేపల్లి

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేద ప్రజలకు న్యాయం జరిగిందని, తమ ప్రభుత్వ కాలంలోనే ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని కాంగ్రెస్ మంచిర్యాల అభ్యర్థి మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. సోమవారం మండలంలోని తాళ్లపేట గ్రామం నుంచి ముత్యంపేట వరకు రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై మహిళలు మంగళహారతులతో ఆహ్వానం పలికి గజమాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి కొరకు పాటుపడుతుందని కాని తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో కేవలం ఒక కుటుంబం మాత్రమే బాగుపడ్డదని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని నియోజకవర్గంలో అనేక సమస్యలు ఉన్నాయని అన్నారు. మంచిర్యాల నడిబొడ్డున కట్టాల్సిన మాత శిశు ఆసుపత్రిని తీసుకెళ్లి పంపు ప్రాంతంలో కట్టి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన మండిపడ్డారు. అనాలోచిత నిర్ణయాలతో నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. తాను గెలిచాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని భారీ మెజారిటీతో తాను విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హస్తం దరిద్రానికి నేస్తం

- తీర్పు వచ్చాక సంగతి చెప్పుడే
- చెన్నూర్ రోడ్ షోలో మంత్రి కేటీఆర్



నవతెలంగాణ-చెన్నూర్

కాగ్రెస్ హస్తం గుర్తు దరిద్రానికి నేస్తం అని, దానికి ఓటు వేస్తే దరిద్రం కొనితెచుకున్నటేనని మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రజలను ఆగం చేసినోళ్ల సంగతి డిసెంబర్ 3న తీర్పు వెలుడినాక చెబుతామని మంత్రి కేటీఆర్ అన్నారు. సోమవారం చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన రోడ్ షోలో రాజకీయ పార్టీలను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ బస్మాసుర హస్తమని నెత్తిన పెట్టుకుంటే బూడిద అయిపోతారని అన్నారు. ఈ మధ్యన మార్పు కావాలనే నినాదంతో జనాల్లోకి వచ్చారని, మార్పంటే 24 గంటలు కరెంటు పోయి 6 గంటల కరెంటు ఇచ్చుడా అని ప్రశ్నించారు. నిండిన చెరువులు పోయి ఎండిన చెరువులు చేసుడా, రైతుబంధు ఎగ్గొట్టుడా, ఎమ్మెల్యేని కలవాలంటే హైదరాబాదుకు బస్సు ఏసుకొని పోవుడా మార్పు అంటే అని అన్నారు. ఒక్క ఛాన్స్ ఇవ్వాలని అంటున్నారని గత 55 ఏళ్లలో 11 సార్లు అవకాశం ఇచ్చినా, కేంద్ర నుంచి రాష్ట్రం దాకా వాళ్లే పదవులు సంపాదించారని, అప్పటి కాకా వెంకటస్వామి నుంచి ఇప్పటి స్వామి వరకు ఎవరు ఏం చేసింది లేదని అన్నారు. ఈ నెల 28న రైతుబంధు వేసుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేసుకోగ, ఎలక్షన్ కమిషన్‌కు లేఖ రాసి రేవంత్‌రెడ్డి దానిని, రాకుండా చేపించాడని, రైతుల నోటికాడి ముద్దను లాక్కున్న దుర్మార్గం కాంగ్రెస్ అని అన్నారు. తెలంగాణలో 24 గంటలు కరెంటు ఇస్తుంటే రేవంత్‌రెడ్డికి అది కనిపించడం లేదని అంటున్నాడని, కరెంటు ఏమైనా మనిశా కనిపించడానికి అని ఎద్దేవా చేశారు. ఆరోజు రూ.200 పెన్షన్ ఇచ్చినోళ్ళు ఈ రోజు రూ.4000 పెన్షన్ ఇస్తారని ఎట్లా నమ్ముతారని అన్నారు. ఒంటరి మహిళ పెన్షన్, రైతుబంధు, రైతుల పెట్టుబడుల గురించి ఆలోచించలేని కాంగ్రెస్‌ను ఎలా నమ్ముతారని ప్రజల ఉద్దేశించి మాట్లాడారు. ఇది నిజంగా నవ్వు వచ్చేలా ఉందని అమ్మకు అన్నం పెట్టినవాడు చిన్నమ్మకు బంగారు గాజులు చేయించుతా అన్నట్లు ఉందని అన్నారు. ఇక బీజేపీ ప్రభుత్వం గురించి మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ గద్దెదించి రూ.400 సిలిండర్ ధరను అమాంతం రూ.1200 చేసి పేదోడి పొట్టగొట్టాడని అన్నారు. 2014లో మోడీ జన్ధన్ ఖాతాలు తెరుచుకోండని, ప్రతి ఒక్కరి ఖాతాలో 15 లక్షలు వేయిస్తానని అన్నారని, ఇప్పటివరకు ఒకరి ఖాతాలోనైనా డబ్బులు పడ్డాయా అని ప్రజలను అడిగారు. నిత్యవసర ధరలను తారాస్థాయికి చేర్చి ప్రియమైన ప్రధానమంత్రిగా కాకుండా జనాల నోట్లో పిరమైన ప్రధానమంత్రిగా నిలిచిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపి వెంకటేష్ నేత, మాజీ మంత్రి బోడ జనార్ధన్, టీఆర్ఎస్ నాయకుడు రాజా రమేష్ బాబు, మున్సిపల్ చైర్మన్ అర్చన రామ్‌లాల్ గిల్డా పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు తప్పక అమలు

జన్నారం : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే 6 గ్యారెంటీ స్కీములను తప్పకుండా అమలు చేస్తామని మండలంలోని తపాలాపూర్ గ్రామ కమిటీ కాంగ్రెస్ సీనియర్ నాయకులు సత్యనారాయణ అన్నారు. సోమవారం తపాలాపూర్ గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ 6 గ్యారెంటీ స్కీములను ప్రజలకు వివరించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం రూ.500కే సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు.

కేసీఆర్‌పై పోరాటం ఆగదు

- పట్టణంలో వివేక్ విస్తృత ప్రచారం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

కేసీఆర్ ఎంత ఒత్తిడితెచ్చిన ఆయనపై నా పోరాటం ఆగదని చెన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ వెంకటస్వామి అన్నారు. పట్టణంలో సోమవారం స్థానిక రాజీవ్‌చౌక్, సూపర్ బజార్, రామాలయం ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ సెంటిమెంట్‌తో గెలిచిన కేసీఆర్, బాల్క సుమన్ అధికార అహంకారంతో ఇష్టం ఉన్నట్టు చేస్తున్నారని మండిపడ్డారు. ధరణిలో పట్టా భూములను నిషేధిత జాబితాలో పెట్టి కేసీఆర్ దందా చేస్తున్నాడని ధ్వజమెత్తారు. కవిత లిక్కర్ స్కాంలో మునిగిపోయి రూ.వేలాది లక్షలు సంపాదించుకుందని అన్నారు. కాళేశ్వరం కట్టిన మేఘ కృష్ణ రెడ్డి, కవిత, కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీకి ఎన్నో సార్లు చెప్పిన చర్యలు తీసుకోలేదని అన్నారు. లిక్కర్ స్కాంలో మనీష్ సిసోడియాను అరెస్ట్ చేసినప్పుడు అదే కేసులో ఉన్న కవితను ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. కేసీఆర్ ఫేక్ పాస్ పోర్ట్ దందాతో జనాలను అనాడు మోసం చేసిండని ఫెమా, ఈడీ కేసులు కేసీఆర్‌పై పెట్టి చర్యలు తీసుకోవాలని అన్నారు. కేసీఆర్, కేటీఆర్ దమ్ముంటే అవినీతిపై చర్చకు రండి సిద్ధంగా ఉన్నానని సవాల్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సుమన్, కేసీఆర్ పక్కాగా అరెస్టు చూపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనీస వేతనాల జీఓను అమలు చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 73 షెడ్యూల్ పరిశ్రమలకు సంబంధించిన ఐదు కనీస వేతనాల జీఓనులను 2021 జూన్‌లో విడుదల చేసిన జీఓలను వెంటనే గెజిట్ చేసి కార్మికుల వేతనాలు పెంచాలని ఎస్సీకేఎస్ (సీఐటీయూ)డివిజన్ అధ్యక్షురాలు వేల్పుల కుమారి డిమాండ్ చేశారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియాలోని నర్సరీ కాంట్రాక్టు కార్మికులతో కలిసి మాట్లాడుతూ రాష్ట్ర హైకోర్టు నవంబర్ 9న 6 వారాల గడువు ఇచ్చినప్పటికీ , ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని, ఐదు జీఓలు గెజిట్ అయితే రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న లక్ష ఇరవై వేల మంది కాంటాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు పెరుగుతాయన్నారు. కానీ కార్పొరేట్ల సేవలో తరించే ప్రభుత్వానికి కాంట్రాక్టు కార్మికుల బాధలు కనిపించడం లేదని, ఒకవైపు కార్మికులపై పని భారాలు పెంచుతూ లాభాలు గడిస్తూ, మరోవైపు నిత్యవసర సరుకుల ధరలను పెంచుతూ, వేతనాలను మాత్రం గొర్రెతోక బెత్తెడు చందంగానే ఉంచుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నిర్లక్ష్యానికి కాంట్రాక్టు కార్మికులు బలవుతున్నారని, దీనిపైన స్పందించిన హైకోర్టు షెడ్యూల్ పరిశ్రమలకు సంబంధించిన జీఓ నెంబర్ 21, 22, 23, 24, 25 లను వెంటనే గెజిట్ చేయాలని ఆదేశాలు జారీ చేసిన, హైకోర్టు తీర్పును కూడా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అంటే రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు తీర్పును ధిక్కరించడమే అవుతుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి కనీస వేతనాల జీఓలను గెజిట్ చేయాలని, జీఓ నెంబర్ 22 గెజిట్ అయితే సింగరేణిలో పనిచేస్తున్న వివిధ విభాగాల కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెరిగే అవకాశం ఉందన్నారు. 2006 నుంచి ఇప్పటి వరకు కొత్త జీఓలను విడుదల చేయలేదని, విడుదల చేసిన జీఓలను గెజిట్ చేయకపోవడంతో సింగరేణిలో పనిచేసే 25 వేల మంది కాంట్రాక్టు కార్మికులు చాలీచాలని వేతనాలతో దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కట్ల కళా, స్వరూప, లక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురు యువకుల చేరిక

నవతెలంగాణ-భీమారం

మండలంలోని వివిధ గ్రామాల నుంచి భారీ సంఖ్యలో యువకులు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. మండలంలోని ఆరెపల్లి, కొత్తపల్లి గ్రామాలతో పాటు చెన్నూర్‌కు చెందిన 50 మంది యువకులు మాజీ ఎంపీ గడ్డం వివేక్ వెంకటస్వామి సమక్ష్యంలో పార్టీ కండువాలు కప్పుకున్నారు. సీనియర్ నాయకులు ఉమ్మడి జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరుతున్న భీమారం మండల జర్నలిస్టుగా పనిచేసిన మంతెన సమ్మయ్య పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ పరినామాల నేపథ్యంలో మెజారిటీ ప్రజలు విశ్వసిస్తున్నది ప్రభుత్వ మార్పు అనివార్యమని అన్నారు. కార్యక్రమంలో జైపూర్ మండలం పార్టీ సీనియర్ నాయకులు రిక్కుల శ్రీనివాసరెడ్డి, చల్లా సత్యనారాయణరెడ్డి, ఆరెపల్లి గ్రామానికి చెందిన నాయకులు ఉష్కమల్ల వెంకటేశ్వర్లు, ఉష్కమల్ల రమేష్, కుమ్మరి రాజమల్లు, దేవరకొండ లింగయ్య పాల్గొన్నారు.

సమస్యలపై నిర్దిష్ట హామీ ఇవ్వాలి

- ఎస్‌సీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి కార్మికుల సమస్యలపై రాజకీయ పార్టీలు నిర్దిష్టమైన హామీ ఇవ్వాలని, అలా ఇవ్వని పార్టీలకు తగిన బుద్ధి చెబుతామని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ అన్నారు. సోమవారం గోలేటిలోని సింగరేణి నర్సరీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల ఆధ్వర్యంలో రాజకీయ పార్టీలు సమస్యలపై నిర్దిష్ట హామీలు ఇవ్వాలని ఎస్‌సీకేఎస్ ఆధ్వర్యంలో గోడప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 30న జరుగనున్న శాసనసభ ఎన్నికలకు వివిధ రాజకీయ పార్టీల నాయకుల తమ మెనిఫెస్టోలను ప్రకటించాయన్నారు. అందులో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల గురించి ఏ రాజకీయ పార్టీ కూడా నిర్దిష్టమైన హామీ ఇవ్వకుండా వివక్షనే చూపించాయన్నారు. కోల్‌బెల్టు ప్రాంతాల్లో పనిచేస్తున్న సింగరేణి కాంట్రాక్టు కార్మికులు 25 వేల మంది ఉన్నారని, గెలుపోటములను నిర్ణయించే అవకాశం ఉందన్నారు. అయినా ప్రధాన రాజకీయ పార్టీలు ఏవీ కూడా సింగరేణి కాంట్రాక్టు కార్మికుల గురించి ఎక్కడా ప్రస్తావించకపోవడం వారి ఓట్లకు దూరమవడమేనని పార్టీల నాయకత్వం గుర్తించాలన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రెండుసార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ సింగరేణి కాంట్రాక్టు కార్మికులను పట్టించుకోలేదని ఆరోపించారు. అసెంబ్లీలో సింగరేణిలో అసలు కాంట్రాక్టు కార్మికులే లేరని ముఖ్యమంత్రి ప్రకటించారని, కేటీఆర్, కేసీఆర్ పర్యటించిన సందర్భంలో కూడా ఎక్కడ కూడా కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై, వారి వేతనాలపై ప్రస్తావించిన దాఖలాలే లేవన్నారు. కాంట్రాక్టు కార్మికులపై బీఆర్ఎస్ ప్రభుత్వ వైఖరి చాలా స్పష్టంగా అర్థమైందన్నారు. ఇచ్చిన కనీస వేతనాల జీఓలను కూడా మూడు సంవత్సరాల నుండి గెజిట్ చేయకుండా మూలన పెట్టారని మండిపడ్డారు. విసుగుచెందిన సింగరేణి కాంట్రాక్టు కార్మికవర్గం ఈసారి మార్పుకై ముందడుగు వేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఏ రాజకీయ పార్టీలైతే సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు స్పష్టమైన హామీ ఇస్తారో ఆ రాజకీయ పార్టీలకే ఓట్లు వేసి కార్మికులను విస్మరించిన పార్టీలకు తగిన గుణపాఠం చెప్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శారద, చిన్నుబాయి, దుర్గం లక్ష్మీ పాల్గొన్నారు.

పకడ్బందీగా పోలింగ్ నిర్వహణకు చర్యలు

- వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌ను పకడ్బందిగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ అన్నారు.సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులు ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటు, ఈవీఎం యంత్రాల తరలింపు, కౌంటింగ్ ఏర్పాట్లు తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ జిల్లా కలెక్టర్‌లకు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమీషన్ మార్గదర్శకాల మేరకు పోలింగ్ నిర్వహణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళలు, యువత, దివ్యాంగులను పోలింగ్‌లో భాగస్వామ్యం చేసేలా కృషి చేయాలన్నారు. రిటర్నింగ్ అధికారులు సైలెన్స్ పీరియడ్‌లో పాటించాల్సిన నిబంధనలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు, అభ్యర్థులకు సమాచారం అందించాలన్నారు. పోలింగ్ సామగ్రి పంపిణి, రిషెప్షన్ కేంద్రాల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర ముఖ్యమైనదన్నారు. ఆదిలాబాద్ అసెంబ్లీకి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను స్థానిక టీటీడీసీ, బోథ్ అసెంబ్లీకి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం బోథ్‌లోని జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ నిర్వహణకు డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలలో పకడ్బందీగా ఏర్పాటు చేయాలని, విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లు కల్పించాలన్నారు. పోలింగ్ అనంతరం పోలింగ్ కేంద్రాల నుంచి కౌంటింగ్ కేంద్రం స్ట్రాంగ్ రూమ్ కు ఈవీఎం యంత్రాల తరలింపుకు అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. పోలింగ్ రోజు పోలింగ్ సిబ్బంది సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని, మాక్ పోల్ నిర్వహించాలని, పోలింగ్ సజావుగా జరిగే విధంగా విధులు నిర్వహించాలని, వల్నరబుల్ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ నిర్వహణ, కంట్రోల్ రూమ్ ఏర్పాటు, పోలింగ్ ప్రక్రియ పర్యవేక్షణకు తీసుకోవలసిన చర్యలపై వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, బోథ్, ఆదిలాబాద్ రిటర్నింగ్ అధికారులు చాహత్ బాజ్ పాయ్, స్రవంతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కాంగ్రెస్‌కు మద్దతుగా టీడీపీ ప్రచారం



నవతెలంగాణ-నస్పూర్

కాంగ్రెస్‌కుమద్దతుగా టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. సోమవారం 16,17 వార్డుల్లో కాంగ్రెస్ నాయకులతో కలిసి ముమ్మరంగా ప్రచారం చేపట్టారు. మంచిర్యాల అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావును గెలిపించాలని ఇంటింటికి తిరుగుతూ అభ్యర్థించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు తలారి రాజు, గరిగంటి రాజయ్య మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో బీఆర్ఎస్ కుటుంబ పాలన తప్ప ప్రజలకు ఏం చేసిందేమి లేదన్నారు. ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం రావాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తెనుగు లావణ్య దేవేందర్, నాయకులు రవి, పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

నాడు లేని అభివృద్ధి.. నేడు చేస్తున్నాం..



ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యేకు తిలకం దిద్దుతున్న మహిళ

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

గత ప్రభుత్వాల హయంలో కోటి రూపాయల నిధులు రావాలంటే ఆపసోపాలు పడాల్సి వచ్చేదని, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే జోగురామన్న తెలిపారు. నియోజకవర్గ చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల ఇక్కట్లను దూరం చేశామని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారం తుది దశకు చేరుకున్న నేపథ్యంలో సోమవారం పట్టణంలోని వివిధ వార్డుల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ముందుగా ఇందిరా నగర్ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యేకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వికలాంగుల కాలనీ, శివాజీ చౌక్, బ్రాహ్మణ వాడ, కుమార్ పేట్ కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటించారు. మహిళాలు ఎమ్మెల్యే మంగళ హారతులు ఇచ్చి తిలకం దిద్దారు. ప్రచారంలో భాగంగా పర్యటించిన ఎమ్మెల్యే పలు ఆలయాలను సందర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక నాయకులు ప్రమోద్ నేతృత్వంలో బీజేపీకి చెందిన దాదాపు వంద మంది గులాబి గూటికి చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగురామన్న మాట్లాడుతూ తొమ్మిదన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో పట్టణ రూపురేఖలు మారేలా అభివృద్ధి చేసి చూపామన్నారు. విలీన వార్డుల్లోనూ మౌలిక వసతులను కల్పించేలా కృషి చేశామని తెలిపారు. ఓపెన్ జీం, పార్కుల ఏర్పాటుతో పాటు ప్రజలకు అన్ని రకాల సదుపాయాలు కల్పించినట్లు వివరించారు. అండర్ డ్రైనేజ్, రహదారుల నిర్మాణాలు, మంచి నీటి సౌకర్యం కల్పించి ప్రజల సమస్యలను దూరం చేశామని పేర్కొన్నారు. పథకాలు నిర్విరామంగా కొనసాలంటే తిరిగి కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, నాయకులు మిషు, శ్రీనివాస్, సలీం పాషా, ప్రమోద్, గందేవార్ శివకుమార్, బాదన్ గంగన్న, చిన్న పటేల్, సాగర్ పాల్గొన్నారు.

అల్పపీడన ప్రభావం...ఆదిలాబాద్‌లో వర్షం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం ఆదిలాబాద్ జిల్లాపై సైతం చూపింది. మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖా అంచనాల మేరకు సోమవారం తెల్లవారు జామున ఏకధాటిగా వర్షం కురిసింది. వేకువ జాము నుండే ప్రారంభమైన వర్షం ఉదయం పది గంటల వరకు మోస్తారుగా కురిసింది. దీంతో జనాలు ఇండ్లకే పరిమితమయ్యారు. చలికి వర్షం తోడు కావడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. మధ్యాహ్నం వరకు సూర్యుడి జాడ లేకపోవడంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. అత్యవసర పనులు ఉన్న వారు మాత్రమే బయటకు రావడంతో ఉదయం పూట ప్రధాన వీధులు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. వానాకాలం మాదిరిగానే ఏకధాటిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో జనాలు ఇండ్లకే పరిమితం అయ్యారు.

రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా సభ్యులకు చోటు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హైదరాబాద్‌లోని ఎస్టీయూ సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన 77వ వార్షిక కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా నాయకులకు చోటు లభించడం పట్ల ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మూగ శ్రీనివాస్, జాదవ్ అశోక్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా దిలేష్ చౌహన్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బెజ్జంకి రవీంద్ర, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలుగా శీతల్ చౌహన్‌లకు రాష్ట్ర కార్యవర్గంలో చోటు లభించింది. రాష్ట్ర క్రీడల కన్వీనర్‌గా ఆనంద్ రావు నియమకమయ్యారు. సంఘ అభివృద్ధితో పాటు విద్యా, ఉపాధ్యా రంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



'యువతను తప్పదోవ పట్టిస్తున్నారు'



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నియోజకవర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు వారం రోజుల నుండి మద్యం, మాంసం, డబ్బులతో యువతను తప్పుదోవ పట్టిస్తున్నారని ప్రజా ఏక్తా పార్టీ అభ్యర్థి కెమ శ్రీనివాస్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. యువతకు కావాల్సింది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అన్నారు. మద్య మాంసం డబ్బు కాదని, యువత ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, యువత ఆలోచించి ఎన్నికల్లో ఓటేయాలని, మంచి పాలన అందించే నాయకున్ని ఎన్నుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

c m y k

ఆర్ఎస్పీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

● తెలంగాణ అన్నాహజారే



నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఈ నెల 30వ తేదీన జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న డాక్టర్ ఆర్ఎస్ ప్రవీన్‌కుమార్‌ను అన్ని సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపించాలని సామజిక కార్యకర్త మాజీ సైనికుడు ఎస్ఎన్ షానఖీ(తెలంగాణ అన్నహజారే) అన్నారు. సోమవారం బీఎస్పీ కార్యాయలంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఉమ్మడి జిల్లాలో పోలీసుగా విధులు నిర్వర్తించిన సంగతి, ఈ జిల్లాకు ఆయన చేసిన సేవలను మరువలేమని అన్నారు. పోలీసు ఉద్యోగం కాకుండా సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా ఉండేవారని, బెల్లంపల్లిలో ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్నప్పుడు ఎంతో మంది ఆయనను ప్రలోభాలకు గురిచేశారని, ఆయన ఎవరికి తలొగ్గక పని చేసుకునేవారన్నారు. అలాగే సామాజిక దృక్పదం ఉన్న గ్రంథాలయాన్ని ఏర్పాటుచేశారని, ఆయన నాతో సన్నిహితంగా ఉండేవాడని, అడిషనల్ డీజీపీగా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ అదనంగా గురుకులాలకు కార్యదర్శిగా పనిచేసి పేద పిల్లలకు ఉన్నతమైన విద్య అందించాలనే లక్ష్యంతో గుర్తింపు చెచ్చుకున్న ఆయనను ఆదరించాలని కోరారు. ఆయన సేవలను నియోజకవర్గ ప్రజలు గుర్తించాలని ఉన్నత ఉద్యోగానికి రాజీనామా చేసి బడుగు బలహీన ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు వచ్చిన ఆయనను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు.

నియోజవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తా

● బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్



నవతెలంగాణ-జన్నారం

ఖానాపూర్ ఎమ్మెల్యేగా గెలిపించి ఆశీర్వదించండి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి చూపిస్తా అని బీఆర్ఎస్ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్ నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని రాంపూర్, తిమ్మాపూర్, తపాలాపూర్, సింగరాయపేట, రోటిగూడ, హమదాబాద్ ధర్మారం, రేండ్లగూడ, గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే గ్రామాల్లో ఉన్న సమస్యలన్నిటిని పరిష్కరిస్తామన్నారు. నిరుద్యోగ యువతకు ఐటీ రంగంలో ఉపాధి కల్పిస్తామన్నారు. తిమ్మాపూర్, రాంపూర్ గ్రామ సరిహద్దులో ఉన్న గోదావరి నదిపై లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి ఆ గ్రామాల ప్రజలకు రైతులకు రెండు పంటలకు నీరు అందించే విధంగా కృషి చేస్తామన్నారు. జన్నారంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల 50 పడకల ఆసుపత్రి ఐటీఐ కళాశాల భవనానికి నిధుల మంజూరు చేస్తామన్నారు. ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిరంతరంగా అందే విధంగా చూస్తామన్నారు. ఖానాపూర్ నియోజకవర్గాన్ని కేటీఆర్ కేసీఆర్ దత్తత తీసుకుంటానన్నారు. తెలంగాణలో ఉన్న అన్ని నియోజకవర్గాల కంటే, ఖానాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. 18 సంవత్సరాలు దాటిన మహిళలకు రూ.3000 సహాయాన్ని అందిస్తామన్నారు. రూ.400కే సిలిండర్ అందిస్తామన్నారు.

కడెం ప్రాజెక్టు నుంచి రెండు పంటలకు నీరు అందిస్తాం

జాన్సన్ నాయక్ గెలిచిన వెంటనే కడెం ప్రాజెక్టుకు మరమ్మత్తులు చేసి, కడెం ప్రాజెక్టు ఎత్తును పెంచి, దిగువ ఆయకట్టు కింద ఉన్న రైతుల పంట భూములకు రెండు పంటలకు నీరు అందించడానికి కృషి చేస్తామని తెలంగాణ ఐటీసీ చైర్మన్ సముద్రాల వేణుగోపాల చారి ప్రచారంలో భాగంగా రైతులకు హామీ ఇచ్చారు. తెలంగాణలో కేసీఆర్‌ను ఖానాపూర్ జాన్సన్ నాయకులు భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, పార్టీ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి ప్రధాన కార్యదర్శి సిలువ జనార్ధన్, ఎంపీపీ మాదాడి సరోజన, జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, సిటీ మల్ల, భరత్, తాళ్లపల్లి రాజేశ్వర్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్ పాల్గొన్నారు. కామన్ పెల్లిలో ఎంపీటీసీ జునుగురి మాధురి సతీష్, సర్పంచ్, మానస శ్రీనివాస్ ఉపసర్పంచ్ జునుగురి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటి తిరుగుతూ జాన్సన్ నాయక్‌ను గెలిపించాలని కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేశారు.

శివాలయంలో ప్రమాణం చేసిన రావి శ్రీనివాస్

నవతెలంగాణ-కౌటాల

ఏఐటీయూసీ పిలుపు మేరకు దేవాలయాల్లో ప్రమాణం చేయాలని ఆదేశించడంతో సోమవారం కాంగ్రెస్ సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి రావి శ్రీనివాస్ మండలకేంద్రంలోని సదాశివ్‌పేట శివాలయంలో అపిడవిట్ పత్రాన్ని తీసుకెళ్లి శివాలయంలో ప్రమాణం చేశారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటవుతుందని, ఈ నెల 30న కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పోలింగ్ కేంద్రం వద్దకు ఓటర్లు వెళ్లేల అవగాహన కల్పించాలని, చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో తనను గెలిపించడానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు.ఎన్నికల్లో గెలిచిన తర్వాత కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ఖచ్చితంగా అమలుచేస్తుందని, నియోజకవర్గం అభివృద్ధి కోసం పూర్తిగా అంకితమవుతానన్నారు. ప్రజలకు ఎళ్లవేళల అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అవినీతికి పాల్పడకుండా పారదర్శకంగా పనిచేస్తూ తెలంగాణ ప్రగతి కోసం కృషి చేస్తానని కార్యకర్తలకు సూచించారు. కార్యకర్తలందరు స్థానికంగా ఉండి చేతి గుర్తుకు ఓటు వేసి ఈవీఎం నమూనా చిత్రాన్ని తీసుకెళ్లి ఓటర్లకు పరిచయం చేయాలని కోరారు.

గూడెంలో ఘనంగా కార్తీక పౌర్ణమి

● వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

నవాతెలంగాణ-దండేపల్లి

మండలంలోని గూడెం గుట్ట సత్యనారాయణ స్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక పౌర్ణమి జాతర సుమారు లక్షపై చిలుకు భక్తుల మధ్య ఘనంగా జరిగింది. కార్తీక పౌర్ణమి సందర్భంగా రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు, పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దేవస్థాన ప్రాంగణం భక్తజనంతో కిటకిటలాడింది. భక్తులు ఉదయం నుండే వేలాదిగా తరలివచ్చి గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి, దీపారాధనలు చేస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గూడెం సత్యనారాయణ స్వామి, అయ్యప్ప, సాయిబాబా ఆలయాలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో గుట్టకింద నుండి పైకి వెళ్లడానికి సౌకర్యాలు కల్పించారు. దర్శనానికి ఇబ్బందులు కలుగకుండా భారీకేడ్లు ఏర్పాటు చేశారు. దేవాదాయ ధర్మదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ రంగు రవికిషన్ గౌడ్, ఈఓ శ్రీనివాస్, జాతర ఉత్సవాలను పర్యవేక్షించారు. భక్తుల తాకిడి ఎక్కువగా ఉండడంతో స్వామి వారి





దర్శనం కోసం గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వచ్చింది. కార్తీక పౌర్ణమి జాతర సందర్భంగా వేదపండితులతో ఆలయాల వద్ద నిత్యాభిషేకాలు, కుంకుమార్చనలు, హోమయ జ్ఞాలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, పుష్పలంకరణ, మహాహారతి, మంత్రపుష్పం, కుంకుమ యజ్ఞాలు, హోమాలు యజ్ఞాలతో వేద పండితులు, అర్చకులు మంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించారు. సుమారు 1200 జంటలు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేపట్టారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని గూడెం దేవస్థాన ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దండేపల్లి, లక్షెట్టిపేట సత్యసాయి సేవా ట్రస్టు సభ్యులు వాలంటీర్లుగా సేవలు అందించారు. అనంతరం అయ్యప్పస్వామి ఆలయ వ్యవస్థాపకులు గురుస్వామి చక్రవర్తుల పురుషోత్తమ చారి సుమారు వెయ్యి మందికి అయ్యప్ప మాలాధారణ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ లక్షెట్టిపేట సీఐ కష్ణ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు చేపట్టారు. బందోబస్తులో దండేపల్లి ఎస్సై ప్రసాద్, లక్షెట్టిపేట ఎస్సై లక్ష్మణ్, తోపాటు పది మంది ఎస్సైలు ఆధ్వర్యంలో సుమారు వంద మంది పోలీసు సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు.

జోరుగా కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ-మందమర్రి

ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ కాంగ్రెస్ ప్రచారం మరింత జోరు పెంచింది. సోమవారం ప్రచారంలో భాగంగా మందమర్రి పట్టణంలోని పాలచెట్టు, మార్కెట్, యాపల్, బస్టాండ్ ప్రాంతాల్లోని 20 వార్డులోని నాయకులు, కార్యకర్తలు ఆరు గ్యారంటీ పథకాలపై గడప గడపకు వెళ్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ వివేక్ వెంకట్ స్వామిపై కావాలనే ఐటీ దాడులు నిర్వహిస్తూ ఆయనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం కేసీఆర్, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను జరగబోయే ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించి ఇంటికి సాగనంపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ వెంకటస్వామి ఘనవిజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేసారు. కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటేనే నిజమైన పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటికి వెళ్తూ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కడారి వీరస్వామి, సోత్తుకు రాజయ్య, మొగిలి రమేష్, ఆలం శంకర్, పోచంపల్లి లక్ష్మి, రజిత, గాజుల సరళ, కృపాక్షి పాల్గొన్నారు.



స్వతంత్ర అభ్యర్థి భారీ బైక్ ర్యాలీ



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

స్వతంత్ర అభ్యర్థి సంజీవరెడ్డి సోమవారం భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని ప్రధాన చౌక్‌ల గుండా మాజీ డీసీసీ జిల్లా అధ్యక్షులు సాజిద్ ఖాన్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాతతో కలిసి భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ప్రజలకు అభివాదం చేస్తూ ఉంగరం గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. గెలుపొందితే సీఆర్ఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తానని ఆయన అన్నారు. ప్రజలు ఆశీర్వాదించాలని కోరారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

నవతెలంగాణ-నస్పూర్

అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక సాధారణ పరిశీలకులు అజయ్ వి నాయక్, ఎన్నికల ప్రత్యేక పోలీసు పరిశీలకులు దీపక్ మిశ్రా అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష సమవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలోని చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాలకు అవసరమైన సామాగ్రిని అందించడం జరిగిందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు బిశ్వజిత్ దత్తా, సజ్జన్, పోలీస్ పరిశీలకులు ఆర్.ఇలంగో, రామగుండం కమీషనర్ రెమా రాజేశ్వరి, ఆర్‌ఓలు బి.రాహుల్, రాములు, సిడాం దత్తు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల ప్రచారం

నవతెలంగాణ-తాంసి

బోథ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడే గజేందర్ గెలుపు కోసం సోమవారం ఈదుల్లా సవర్గాం, దనోర, భీంపూర్ గ్రామాల్లో సీపీఐ నాయకులు చిలుక దేవిదాస్ మండల నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలకు చేసిన మోసాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో పది సంవత్సరాలుగా ఉన్నప్పటి అభివృద్ధి జరగలేదని అన్నారు. కేవలం ఆ పార్టీ నాయకులు మాత్రమే అభివృద్ధి చెందారని అన్నారు. అలాంటి ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలన్నారు. బీజేపీ కులమతాల్లో చిచ్చు పెట్టి ఓట్లు సీట్లు దండుకొనే పార్టీ అన్నారు. బడుగు వర్గాల రైతులకు న్యాయం జరగాలంటే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. ఆరు గ్యారంటీలు అందరికీ ఉపయోగ పడతాయి అన్నారు. చేతు గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థి ఆడే గజేందర్ గెలిపించి అసెంబ్లీకి పంపుదామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుంట రాములు, రమేష్, శామీర్ పాల్గొన్నారు.

అనుమతి లేనిది ప్రకటనలు ఇవ్వరాదు

నవతెలంగాణ-నిర్మల్

ఓటింగ్‌కు ముందు మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ అనుమతి లేకుండా పార్టీ, అభ్యర్థి ప్రింట్ మీడియాలో ఎలాంటి ప్రకటనను ఎన్నికల రోజు, ఒకరోజు ముందు ప్రచురించరాదని ఎన్నికల అధికారి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం 28న ముగుస్తుందన్నారు. మీడియా సర్టిఫికేషన్, మానటరింగ్ కమిటి అనుమతి లేకుండా రాజకీయ పార్టీ, అభ్యర్థి ప్రకటనలు ప్రచురించకూడదని సూచించారు. లేనిపక్షంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

వాలీబాల్ టోర్నమెంట్

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సోనాపూర్ నాయకపుగూడలో బద్ది శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ముందుగా ఉసిరి చెట్టు దగ్గర పూజలు చేసి వన భోజనాలు చేశారు. అనంతరం వాలీబాల్ టోర్నమెంట్‌లో 10 జట్లు పాల్గొనగా ఫైనల్లో సోనాపూర్, బుగ్గగూడ జట్లు తలబడ్డాయి. గెలుపొందిన బుగ్గగూడ, రన్నరప్‌గా నిలిచిన సోనాపూర్ నగదు బహుమతులు అందించారు. యువకులు క్రీడాల్లో రాణించాలని ఆకాంక్షించారు.

విలువైన మద్యం స్వాధీనం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలో సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ డి.సాయినాథ్ వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ సోమవారం వాహనాలు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో రూ.28వేల 600 విలువ గల మద్యం స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ చౌక్‌లో షేక్ సల్మాన్, సంజయ్‌నగర్‌కు సంబంధించిన వ్యక్తి వద్ద రూ. 7వేల 600 విలువ గల 32 ఐఎంఎఫ్ఎల్ మద్యం బాటిళ్లు, అలాగే కలెక్టర్ చౌరస్తాలో తలమడుగు మండలానికి సంబంధించిన దివాకర్ వద్ద రూ.21వేల విలువచేసే 24 రాయల్ స్టాగ్ మద్యం లభించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, సీసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికలలో భాగంగా ఈనెల 30వ తేదీన జరగనున్న పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు అజయ్ మిశ్రా, దీపక్ మిశ్రా అన్నారు. సోమవారం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు, ఎన్నికల సాధారణ పరిశీలకులు రాహుల్ మహివాల్, పోలీసు పరిశీలకులు డి.కె. చౌదరి, జిల్లా ఎస్పీ సురేష్ కుమార్‌తో కలిసి ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని సిర్పూర్, అసిఫాబాద్ నియోజకవర్గాలకు ఈనెల 30వ తేదీన జరగనున్న పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో 4,53,538 మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో పురుషులు 2,26,844, స్త్రీలు 2,26,666, ట్రాన్స్ జెండర్లు 28 మంది ఉన్నారని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 90 శాతం మందికి ఓటర్స్ స్లిప్పులు పంపిణీ చేయడం జరిగిందని, 73,106 ఓటర్లకు గుర్తింపు కార్డులను తపాల శాఖ ద్వారా పంపిణీకి చర్యలు తీసుకున్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో 294, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 305 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, సిర్పూర్ నియోజకవర్గానికి 25 శాతం అదనంతో 366 బ్యాలెటింగ్ యూనిట్లు, ఆసిఫాబాద్ నియోజకవర్గానికి 25 శాతం అదనంతో 672 బ్యాలెటింగ్ యూనిట్లను కేటాయించామన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో ఎన్నికల బరిలో 13 మంది, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 17 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని, సిర్పూర్‌లో 45, ఆసిఫాబాద్‌లో 47 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ నిర్వహణ కొరకు 719 మంది ప్రిసైడింగ్ అధికారులు, 719 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 1438 మంది ఇతర ప్రిసైడింగ్ అధికారులు, 94 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించినట్టు వివరించారు. దివ్యాంగులు, 80 సంవత్సరాల వయసు పైబడిన వయోవృద్ధులు 98 మందిని గుర్తించి హోం ఓటింగ్ పూర్తి చేశామన్నారు. డిసెంబర్ 3 కౌంటింగ్ కొరకు జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కేంద్రాన్ని ఏర్పాటు చేసి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

కార్మికుల సంక్షేమమే కేసీఆర్ లక్ష్యం : టీబీజీకేఎస్

నవతెలంగాణ-రెబ్బెన

కార్మికుల సంక్షేమమే కేసీఆర్ లక్ష్యమని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంకట్‌రావ్ అన్నారు. సోమవారం మండలంలోని గోలేటిలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే సింగరేణిలో అధిక లాభాల వాటను కార్మికులు పొందగలుగుతున్నారన్నారు. మరోసారి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కార్మికుల సంక్షేమం కోసం మరింత చర్యలు తీసుకుంటామని తెలిపారు. మూడోసారి సీఎం కేసీఆర్ అయితే మరిన్ని పథకాలను అమలు చేస్తారని అన్నారు. సంక్షేమం అభివృద్ధితో పదేళ్లపాటు పాలన అందించామని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో వచ్చి మాయమాటలు చెప్పే కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మవద్దని కోరారు. కార్మికులు ఐక్యంగా ఉండి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని, లేని పక్షంలో సింగరేణి సంస్థ ప్రైవేట్ అయ్యే అవకాశం ఉందన్నారు. కార్మికులు ఈ విషయాన్ని గుర్తించుకుంటూ కారు గుర్తుకు ఓటేయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మాల్రాజ్ శ్రీనివాసరావు, ఎస్ ప్రకాష్ రావు, సదాశివ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

ఎన్నికల నియమావళి పాటించాలి: మంచిర్యాల కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో 30న జరిగే పోలింగ్ అనంతరం డిసెంబర్ 3 వరకు ఎన్నికల నియమావళి పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా పాలనాధికారి బదావత్ సంతోష్ సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రామగుండం కమీషనర్ ఆఫ్ పోలీస్ రెమా రాజేశ్వరి, డీసీపీ సుధీర్ రామ్నాథ్ కేకన్తో కలిసి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో పాటు రాజకీయ పార్టీల నాయకులతో వేరువేరుగా సమావేశం నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పోలింగ్ రోజున ఓటింగ్ ప్రక్రియ ముగిసే 48 గంటల ముందు నుండి అమలవుతున్న ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. పార్టీ తరుపున వ్యక్తులకు గుర్తింపు కార్డులు అందించాలని, పోలింగ్ కేంద్రానికి సమీపంలో ఓటర్లను ప్రలోభపెట్టే విధంగా ఎలాంటి ప్రచారం నిర్వహించరాదని తెలిపారు. అభ్యర్థి, ఎన్నికల ఏజెంట్, ఇతరులకు ఒక్కొక్క వాహనాన్ని అనుమతించడం జరుగుతుందని, ఐదుగురికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నాణ్యమైన పోలీసు వ్యవస్థను అందించాలి

నవతెలంగాణ-నిర్మల్

నాణ్యమైన పోలీసు వ్యవస్థను జిల్లా ప్రజలకు అందించి, పోలీసుల గౌరవం మరింత పెంచే విధంగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ చల్లా ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల విభాగం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఫిర్యాదుదారులు హాజరై సమస్యలను ఎస్పీకి తెలియజేశారు. అర్జీలను అందజేశారు. వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా సమస్యలు పరిష్కరించాలన్నారు. సామాన్య ప్రజలకు పోలీసులు అండగా ఉండాలని వారితో స్నేహబావంతో ఉండాలని, శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చట్టరీత్యా చర్యలుంటాయన్నారు. పోలీసుల సహాయం కావాలనుకున్నా వారు పోలీసు స్టేషన్‌లో నిర్భయంగా ధరాఖాస్తు చేసుకోవాలని, అనుమానస్పద వ్యక్తులు, సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నాయని దృష్టికి వస్తే వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు 8712659599కు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు.